ప్రజాశక్తి
గురువారం 21 నవంబర్ 2024
5
అనంతపురం





జీపుజాతాను ప్రారంభిస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

రైతు, కార్మిక వ్యతిరేకంగా బిజెపి పాలన

- ఈ చర్యలను ఐక్యంగా తిప్పికొట్టాలి
- 26న కలెక్టరేట్ వద్ద మహాధర్నా
- జీపుజాతాలో కార్మిక, రైతుసంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

కేంద్రంలోని బిజెపి పాలనంతా రైతు, కార్మిక వ్యతిరేక విధానాలతోనే సాగుతోందని, ఈ చర్యలను అందరూ ఐక్యంగా తిప్పికొంట్టి హక్కులను కాపాడుకోవాలని కార్మిక, రైతుసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ అనంతపురం కార్పొరేషన్ కార్యాలయం వద్ద జీపుజాతాను బుధవారం ప్రారంభించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజలు జాతాను ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అధికం అయ్యాయన్నారు. కార్మిక, రైతు నల్ల చట్టాలను అమలు చేసేందుకు వేగం పెంచిందన్నారు. గతంలో కార్మికులు, రైతుల ఆందోళనల నేపథ్యంలో నల్ల చట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన బిజెపి ప్రస్తుతం దానిని తుంగలో తొక్కాలని చూస్తోందని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. నల్లచట్టాలు, నాలుగు లేబర్ కోర్టులను తక్షణం రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, జాతీయ రహదారులు, ఓడరేవుల ప్రయివేటీకరణను ఆపాలన్నారు. ప్రభుత్వ సంస్థలను అంబానీ, ఆదానీకి కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పే కుట్రను ఆపాలన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. స్కీం వర్కర్స్ అందరికీ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని కోరారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలకు 200 రోజులు ఉపాధి కల్పించి 600 రూపాయలు కనీస కూలి ఇవ్వాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ 26న కలెక్టరేట్ వద్ద చేపట్టిన మహాధర్నాలో రైతులు, కార్మికులు, ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏటీఎం నాగరాజు, నాగభూషణం, భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ ఎన్టీఆర్ శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా నాయకులు బిహెచ్.రాయుడు, మున్సిపల్ ఇంజినీర్ సెక్షన్ నగర అధ్యక్షుడు ఓబుళపతి, కోశాధికారి పోతలయ్య, ఎర్రిస్వామి, తిరుమలేసు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ వైసిపిలో

జగని రచ్చ..!!





అధికారం మార్పు తర్వాత పెనుకొండ వైసిపి పరిస్థితి మూడు కొట్లాటలు.. ఆరు కుమ్మొలాటలు అన్న చందంగా తయారైంది. పట్టు కోసం ఇద్దరు మాజీ మంత్రులు నువ్వానేనా అంటూ కాలుదువ్వుతున్నారు. ఇద్దరు మాజీ మంత్రులకు సొంత నియోజకవర్గం లేక ఇక్కడే పాగా వేయాలని ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. ఉషశ్రీ వద్దు అంటూ ఒక వర్గం.. శంకరనారాయణ వద్దు అంటూ మరో వర్గం పోటాపోటీగా సభలు, సమావేశాల్లో బహిరంగా ప్రకటిస్తున్నారు. ఇటీవల ఇద్దరు నేతలు, వారి అనుచరుల మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనే స్థాయికి వర్గ విభేదాలు చేరుకున్నాయి. శంకరనారాయణకు మద్దతుగా ఉన్న గోరంట్ల మండలానికి చెందిన ముగ్గురు నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో విభేదాలు తారాస్థాయికి చేరుకుని నువ్వా నేనా అంటూ సవాళ్లు.. ప్రతిసవాళ్లు విసురుకుంటున్నారు.

- వీధికెక్కుతున్న మాజీ మంత్రుల పోరు
- నువ్వా..నేనా అంటున్న ఉషశ్రీ, శంకరనారాయణ
- ఉషశ్రీకి వ్యతిరేకంగా సమావేశాలు
- జనసేన, బిజెపి టచ్‌లోకి ఇద్దరు నేతలు

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ నియోజకవర్గం పరిధిలోని గోరంట్ల మండలంలో ఇటీవల ఉషశ్రీకి వ్యతిరేకంగా సమావేశం నిర్వహించిన నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో ఒక్కసారిగా పార్టీ నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. బుధవారం నాడు గోరంట్లలో సస్పెండ్ అయిన బాబు(బుల్లెట్), నాగేనాయక్, పాటూరిశంకర్ రెడ్డి(కనిగిరి శంకర్‌రెడ్డి)లు పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఉషశ్రీ గెలుపుకోసం, పార్టీ అభివృద్ధి కోసం కష్టపడ్డామని, అప్పుడేందుకు మమ్మల్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయలేదంటూ ప్రశ్నించారు. ఉషశ్రీని పెనుకొండ నియోజకవర్గం నుంచి పంపించే వరకు తమ పోరాటం అగదంటూ హెచ్చరించారు.

తారాస్థాయికి వర్గ విభేదాలు

2024 ఎన్నికల్లో పెనుకొండ నియోజకవర్గం నుంచి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉషశ్రీ పోటీచేసి ఘోరంగా పరాజయం పాలైయ్యారు. అప్పటి వరకు పెనుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న శంకర నారాయణ అనంతపురం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఓటమి మూటగట్టుకున్నారు. ఈ ఇద్దరికీ సొంత నియోజకర్గాలు లేవు. దీంతో పెనుకొండలో పాగా వేసేందుకు ఇద్దరు మాజీలు ప్రయత్నిస్తున్నారు. వీరిద్దరికీ పార్టీలో వ్యతిరేక వర్గాలూ ఉన్నాయి. శంకరనారాయణ మంత్రిగా ఉన్న సమయంలో ఒక సామాజికవర్గం నాయకులను అణగదొక్కరనే ఉద్దేశంతో ఉషశ్రీకి ఆ వర్గం నాయకులు దగ్గరైయ్యారు. శంకరనారాయణ వద్దు అంటూ వారు వ్యతిరేకిస్తున్నారు. మరో వైపు ఉషశ్రీని వ్యతిరేకించే శంకరనారాయణ వర్గం నాయకులు, కార్యకర్తలు ఆమె పెనుకొండకు వద్దు అంటూ బహిరంగం సభల్లో ప్రకటిస్తున్నారు. ఉషశ్రీ తనకు అనుకూలంగా ఉన్న భజనపరులనే దగ్గరకు తీసుకుందని, పార్టీకోసం కష్టపడి పని చేసిన వారిని దూరం పెడుతోందనే విమర్శలున్నాయి. బెంగళూరులో నివాసం ఉంటూ చుట్టపుచూపుగా వచ్చి వెళ్లుతుందని ఇలాంటి పరిస్థితుల్లో అందరికీ అందుబాటులో ఉన్న శంకరనారాయణ తమకు మేలని ఆయన మద్దతుదారులు చెబుతున్నారు. ఉషశ్రీని జిల్లా అధ్యక్షురాలుగా పార్టీ అధిష్టానం ప్రకటించినప్పటి నుంచి శంకరనారాయణ వర్గంపై కక్షసాధింపు చర్యలు తీసుకోంటుందని ఆరోపణ లున్నాయి.

పార్టీ క్యాడర్‌లో అయోమయం

పెనుకొండ నియోజకవర్గం అంటే తెలుగుదేశంకు కంచుకోట. 2019 ఎన్నికల్లో మాలగుండ్ల శంకరనారాయణ విజయం సాధించి టిడిపి కోటపై వైకాపా జెండా ఎగురవేశారు. అనంతరం జరిగిన పరిణామాల్లో ఆయన అనంతపురం ఎంపీగా పోటీచేసి ఓడి పోయారు. కళ్యాణదుర్గం నుంచి వచ్చిన ఉషశ్రీ తెలుగుదేశం అభ్యర్థి సవితపై పోటీచేసి ఓటమిపాలైయ్యారు. ఓటమి చెందిన తర్వాత తన మకాం బెంగళూరుకు మార్చారు. శంకరనారాయణ మాత్రం పెనుకొండలో నివాసం ఉంటున్నారు. దీంతో పార్టీ క్యాడర్ అందుబాటులో ఉన్న శంకరనారాయణ వద్దకు వెళ్తున్నారు. శంకరనారాయణ వర్గం ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా పని చేశారని భావించిన ఉషశ్రీ వారిని దూరంపెడుతూ వచ్చింది.


మరో వైపు తనను నియోజకవర్గం నుంచి పోటీ చేయకుండా అడ్డుకున్న శంకరనారాయణ వ్యతిరేక వర్గం ఉషశ్రీకి అండగా నిలిచింది. దీంతో పార్టీ క్యాడర్ రెండు వర్గాలు విడిపోయింది. పార్టీ పిలుపినిచ్చన కార్యక్రమాలు రెండు వర్గాలూ విడివిడిగా చేస్తున్నాయి. సొంత పార్టీ నేతలే ఒకరిపై ఒకరూ నిందల వేసుకుంటూ అభసుపాలు అవుతున్నారు. దీంతో పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలు ఎవరి వద్దకు వెళ్లాలో అర్థం కాక అయోమయానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఉషశ్రీ వద్దు అంటూ పార్టీ అధిష్టానానికి తెలిపేందుకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు వెళ్లుతున్నట్లు తెలిసింది.

జనసేన, బిజెపి టచ్‌లోకి ఇద్దరు మాజీ మంత్రులు..

ఇద్దరు నేతల మధ్య విభేధాల నేపథ్యంలో వైసిపి పెనుకొండ నియోజకవర్గం బాధ్యతలు ఎవరికీ ఇస్తారో తెలీయని దుస్థితి నెలకొంది. దీంతో మాజీ మంత్రులిద్దరూ తమ దారి వెతుక్కునే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరిలో ఒకరు జనసేన, మరోకరు బిజెపి పార్టీ నాయకులతో సంప్రదింపులు జరిపినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వైకాపాలో ఉంటే తమ ఉనికి కోల్పోవాల్సి వస్తుందని భావించిన మాజీ మంత్రులు పార్టీ మారేందుకు సిద్ధమైనట్లు తెలిస్తోంది. ఒక మాజీ మంత్రి ఇప్పటికే బెంగళూరులో బిజెపి నాయకులతో చర్చించినట్లు సమాచారం. మరో మాజీ మంత్రి తనకు పరిచయం ఉన్న జనసేన ముఖ్య నాయకులతో మాట్లాడినట్లు నియోజకవర్గంలో పుకార్లు చక్కర్లు కొట్టుతున్నాయి.

మరి కొందరిపై వేటు..?

ఉషశ్రీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న శంకరనారాయణ వర్గానికి చెందిన మరి కొందరు నాయకులు, కార్యకర్తలపై వేటు వేసేందుకు జిల్లా అధ్యక్షురాలు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే గోరంట్ల మండలానికి చెందిన ముగ్గురు ముఖ్య వైసిపి నాయకులను మూడు రోజుల క్రితం పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ఆమెకు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడిన వారిపై చర్యలు తీసుకుంటుందని గుసగుసులున్నాయి. నియోజవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను పూర్తిగా తనవైపు మార్చుకునేందుకు ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారని పార్టీ నాయకులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో పెనుకొండ నియోజకవర్గం వైసిపి పరిస్థితి రానురాను దిగజారిపోతోందనే భావన ఆ పార్టీ మద్దతుదారుల నుంచే విన్పిస్తోంది.





ఉషశ్రీకి వ్యతిరేకంగా విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి గోరంట్ల నాయకులు

అర్హులకు అన్యాయం చేయొద్దు : యుటిఎఫ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మున్సిపల్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల ఉద్యోగోన్నతుల్లో అర్హులకు అన్యాయం చేయొద్దని ఉమ్మడి అనంతపురం జిల్లా యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల కోసం ఇటీవల విడుదల చేసిన సీనియార్టీ జాబితాలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల జాబితాలో అనర్హత గల వారిని చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ ఉమ్మడి జిల్లా యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం డిఇఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. డిఇఒ ప్రసాద్ బాబును కలిసి సమస్యను విన్నవించారు. ఉద్యోగోన్నతుల జాబితాలో అవకతవకలను తొలగించి అర్హత గల వారికి మాత్రమే ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులుగా అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల ఉదోగోన్నతులు 70:30 శాతం ప్రకారం ఖాళీలను ప్రదర్శించాలన్నారు. అర్హత గల అన్ని సబ్జెక్టుల్లో ఉద్యోగోన్నతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సత్యసాయి జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రా రెడ్డి, అనంతపురం జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, అనంతపురం నగర యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసులు, ఆదిశేషయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

సెలవుల తర్వాత అనంత సంకల్పం చేపట్టాలి

అనంతపురం కలెక్టరేట్ : 10వ తరగతి విద్యార్థులకు అనంత సంకల్పం కార్యక్రమం కార్యాచరణ ప్రణాళికను సంక్రాంతి సెలవుల తర్వాత అమలు చేయాలని ఫ్యాప్టో నాయకులు కోరారు. ఈ మేరకు ఎడి కృష్ణయ్యకు బుధవారం విన్నవించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చాలా పాఠశాలల్లో సిలబస్ పూర్తి కావాల్సి ఉందన్నారు. సంక్రాంతి సెలవుల తర్వాత, రెండవ శనివారం, ఆదివారం, ప్రభుత్వ సెలవు దినాలను మినహాయించి కార్యాచరన ప్రణాలికను అమలు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. 10వ తరగతి ఫలితాల కోసం అందరూ కష్టపడి జిల్లా విద్యాశాఖకు మంచి పేరు తీసుకువచ్చేందుకు ఉపాధ్యాయులు తోడ్పాటు అందించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ ఎస్.సిరాజుద్దీన్, కో ఛైర్మన్ పురుషోత్తం, జి.లింగమూర్తి, ఎన్.రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాయకులు లింగమయ్య, శివశంకర్, ఎస్.రామాంజనేయులు, రామకృష్ణ, గంగాధర్ సుహైల్, మన్సూర్ పాల్గొన్నారు.





మరణించిన తండ్రీకుమారుడు రామాంజినేయులు, రవి(ఫైల్‌ఫొటో)

కూలీ ఇంట విషాదం..!

తెగిపడిన విద్యుత్ తీగలు - తండ్రీకుమారుడు మృతి

బంధువుల ఇంటికెళ్లి తిరిగొస్తున్న తండ్రీకుమారున్ని విద్యుత్ తీగల రూపంలో మృత్యువు కబళించింది. ద్విచక్రవాహనంలో వెళ్తున్న సమయంలో 11కెవి విద్యుత్ తీగలు తెగి మీదపడడంతో తండ్రీకుమారుడు ఘటనా స్థలంలోనే మరణించారు. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం దంతాలపల్లి వద్ద బుధవారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటన బాధిత కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. మృతి చెందిన తండ్రీకుమారున్ని చూసి కుటుంబ సభ్యులు గుండెలవసేలా రోధించారు.

వార్త మెయిన్

నిధుల కోసం ముఖ్యమంత్రికి వినతి



బుక్కరాయసముద్రం : శింగనమల నియోజకవర్గం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు గురువారం సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గం పరిధిలోని గండికోట నుంచి పుట్లూరు వయా సుబ్బరాయ సాగర్ ఎత్తిపోతల పథకంకు ఫైనాన్స్ క్లియరెన్స్ లభిస్తే, దాదాపు 35 వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుందన్నారు. శింగనమల మండలం రాచేపల్లి గ్రామ సమీపంలో ఉన్న లెదర్ ఫ్యాక్టరీని పున్ణప్రారంభం చేస్తే 3వేల ఎస్సీ కుటుంబలకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. 2003లో నీటి ముంపునకు గురైన ఉల్లికల్లు, ఉల్లికంటి గ్రామ ప్రజలుకు పునరావాసంకు ఇచ్చే నిధులు కొత్త ప్యాకేజీ కింద ఇవ్వాలని కోరారు. బుక్కరాయసముద్రం, నార్పల, గార్లదిన్నెలను కరువు మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో ఆ మండలాల రైతులను ఆదుకోవాలని కోరారు. సమస్యలపై సానుకూలంగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

జనవరిలో ఎస్ఎస్‌బిఎన్ 80వ వసంతోత్సవ వేడుకలు

- హాజరుకానున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు
- ఎస్ఎస్‌బిఎన్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు పరుచూరి రమేష్ బాబు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం శ్రీ సాయిబాబు జాతీయ పాఠశాల, కళాశాలల 80వ వసంతోత్స వాలను జనవరి 3,4,5 తేదీల్లో నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రీకారం చుట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కళాశాల ఆవరణంలో మూడు రోజుల పాటు వేడుకలను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈ కార్యక్రమానికి పాఠశాల, కళాశాలల్లో చదువుకుని దేశ విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు, ఐఎఎస్ అధికారులు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులకు ఆహ్వానం పలికేలా పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఎస్ఎస్‌బిఎన్ విద్యాసంస్థల పూర్వ విద్యార్థుల సంఘం బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు పరుచూరి రమేష్ బాబు మాట్లాడుతూ 1945లో ఆదినారాయణ శ్రీ సత్యసాయిబాబా జాతీయ ఉన్నత పాఠశాలను స్థాపితం అయ్యిందన్నారు. ఎంతో ఉన్నతమైన, విలువలు కలిగిన విద్యాను ఈ విద్యాలయం ద్వారా అందించినట్లు చెప్పారు. ఈ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించిన ఎంతో మంది విద్యార్థులు ప్రతి ఏడాదీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించిన విద్యార్థులు ఎంతో మంది కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఎస్పీలు, డీఎస్పీలుగా స్థిరపడ్డారన్నారు. ఈ నేపథ్యంలోనే ఆ పూర్వ విద్యార్థులతో పాటు చదువులు నేర్పించిన పూర్వ ఆచార్యులు అందరూ కలిసి 80 వసంతోత్సవాల పేరిట పూర్వ విద్యార్థుల, ఆచార్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా జనవరి 3న పాఠశాల, 4న జూనియర్ కళాశాల, 5న డిగ్రీ, పీజీ కళాశాలల ఆత్మీయ సమ్మేళన వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించిన ప్రతిఒక్క విద్యార్థి ఎక్కడున్నా వేడుకల్లో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షులు పిఎల్ఎన్.రెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్ఆర్.నాగభూషణం, కార్యదర్శి సుంకు వేణుగోపాల్, సహాయ కార్యదర్శులు శివచంద్ర, అన్నపూర్ణ, కోశాధికారి చంద్రశేఖర్ గుప్తా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థుల కమిటీ నాయకులు

వందశాతం ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధి : కలెక్టర్

ప్రజాశక్తి-గుత్తి

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో అనంతపురం జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండేలా అధికారులకు కృషి చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం లబ్ధిదారుల అవగాహన వారోత్సవాల కార్యక్రమాన్ని బుధవారం ఉదయం గుత్తి మండలం జక్కలచెరువు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 2.0 పథకం మండలంలోని ఒక గ్రామంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందించే ప్రతి పథకం లబ్ధీ చిట్టచివరి గ్రామం, లబ్ధిదారునికి చేరాలన్నారు. ఇళ్లు లేని వారందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఇంటి నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ పనులను త్వరితగతిన పూర్తి చేసి బిల్లులను లబ్ధిదారుల అందే విధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జక్కల చెరువు గ్రామంలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని ఇళ్లలో నివసిస్తున్న బొలికొండ, సురేష్ బాబు, వీరారెడ్డిలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ శైలజ, జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి, తహశీల్దార్ ఓబులేసు, ఎంపీడీవో ప్రభాకర్, హౌసింగ్ ఈఈ మధుసూదన్ రెడ్డి, ఏఈ సూర్యనారాయణ, ఎంపీపీ విశాలాక్షి, ఎంపీటీసీ నారాయణస్వామి, ప్రజా ప్రతినిధులు నారాయణ, ఈశ్వర్ పాల్గొన్నారు.



గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్



ఇరాన్‌లో మేయర్ వసీం

ఏసియన్ మేయర్స్ ఫోరంలో మేయర్ వసీం

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

ఇరాన్‌లో జరిగే ఏసియన్ మేయర్స్ ఫోరంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందడంతో అనంతపురం మేయర్ మహమ్మద్ వసీం సలీం ఇరాన్‌కు చేరుకున్నారు. బుధవారం మేయర్ వసీం ఇరాన్ దేశ రాజధాని తెహరాన్ చేరుకున్నారు. అక్కడ తెహరాన్ మున్సిపల్ అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ నెల 21, 22వ తేదీల్లో ఆసియన్ మేయర్స్ ఫోరం (ఏఎంఎఫ్) ఆధ్వర్యంలో ఖోర్రామాబాద్‌లో ఆసియన్ దేశాల్లోని మేయర్లతో పలు అంశాలపై నిర్వహించే సదస్సులో పాల్గొంటారు. ఈ సదస్సులో ప్రధానంగా ఆసియా దేశాల్లోని నగరాల్లో పౌరుల మధ్య మంచి సంబంధాలు పెంచడం, మెరుగైన జీవితం కల్పించడం, ఆయా దేశాల మధ్య దౌత్యం, పరస్పరం విజ్ఞానం మార్పిడి, సాంకేతిక పరిజ్ఞానంతో ఆయా నగరాల్లో చేపట్టినటువంటి కార్యక్రమాలు తదితర అంశాలపై మేయర్లు తమ అనుభవాలను వివరిస్తారు. ఎఎంఎఫ్ సదస్సులో ప్రధానంగా పర్యావరణం, పట్టణ ఆరోగ్యంపై విఫలంగా చర్చించి ఆయా ప్రాంతాల్లో అనుసరిస్తున్న విధానాలను చర్చిస్తారు. ఇరాన్ పర్యటనకు అవకాశం రావడంపై మేయర్ వసీం మాట్లాడుతూ అనంతపురం నగరం ప్రజలకు దక్కిన గౌరవంగా తాను భావిస్తున్నానని తెలిపారు.

సాగు నీటి ఎన్నికలకు సర్వంసిద్ధం

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలోని నాలుగు గ్రామాలకు సాగు నీటి ఎన్నికల జరగనున్నాయి. ఆయా గ్రామాలకు ఇదివరకే అధికారులు జాబితాను సిద్ధం చేశారు. సాగునీటి గ్రామాలలో ఓటర్ల జాబితా ప్రక్రియ పూర్తి అయ్యింది. మండలంలో కల్లూరు, యల్లనూరు, వేములపల్లి, తిరుమలాపురం నాలుగు గ్రామాలకు సాగు నీటి ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణపై జిల్లా కేంద్రంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి మండల పిఐలు వెళ్లారు.

బాల్య వివాహాలను అరికడదాం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బాల్య వివాహాలు, లింగ వివక్షత నిర్మూలనపై మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో గ్రామసంఘాలకు బుధవారం నాడు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ ఎం.పర్వీన్ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఆడపిల్లలకు 18, మగపిల్లలకు 21 సంవత్సరాల తర్వాత వివాహం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ టి.మోహన్ బాబు, సూపర్ వైజర్ కేశవయ్య, ఆరోగ్య కార్యకర్త రాజేంద్ర ప్రసాద్ ఎఎన్ఎం రామలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ ఆధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమెతోపాటు రవికాంత్ రమణ, రచయిత కంబదూరి షేక్ నబీ రసూల్, పి.శ్రీరాములు హాజరై మాట్లాడారు. గ్రంథాలయాలు డిజిటల్ గ్రంథాలయాలుగా రూపాంతరం చెందుతున్నాయని వాటితో పాటు మనము సాంకేతికంగా నిష్ణాతులు అయి వాటిని గరిష్టంగా ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన డ్రాయింగ్ వక్తృత్వం, రంగవల్లి మొదలగు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతలు అందజేశారు.

యల్లనూరు : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిసాయి. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం నాడు జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రత్నమ్మ బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరంగయ్య, నరసింహులు, లైబ్రేరియన్ ప్రకాష్ రెడ్డి, సిబ్బంది రామచంద్ర పాల్గొన్నారు.



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై 26న ధర్నా

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ నెల 26వ తేదీ కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు పిలుపునిచ్చారు. రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతాలో భాగంగా బుధవారం సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ అధ్యక్షతన పట్టణంలోని బాబుజగజ్జీవన్‌రామ్ సర్కిల్‌లో ఓబులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పంటలకు మద్దతు ధర, విద్యుత్ సవరణ బిల్లు రద్దు, స్మార్ట్ మీటర్ల రద్దు, రైతు రుణమాఫీ, జిల్లాకు సరిపడా నికర జలాలు, 2023 రబీలో నష్టపోయిన రైతులకు పరిహారం, కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, పారిశుధ్య, వెలుగు, శ్రీరామిరెడ్డి, సత్యసాయి, మున్సిపల్, సివిల్ సప్లైస్ కార్మికులకు ఇచ్చిన హామీలు, కనీస వేతనం, తదితర డిమాండ్లపై ఈ నెల 26వ తేదీ కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయం వద్ద చేపడుతున్న ధర్నాలో కార్మికులు, కర్షకులు, రైతులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, శ్రీరామిరెడ్డి, యూనియన్ జిల్లా ట్రెజరర్ వన్నూరుస్వామి, అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పాతక్క, సిఐటియు నాయకులు రంగనాథ్, రఘు, నరేష్, హనుమంతరెడ్డి, నాగరాజు, శివ, నటరాజ్, ప్రకాష్, వన్నూరుస్వామి, డివైఎఫ్ఐ నాయకులు సోము, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

జీపుజాతాలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు



కళ్యాణదుర్గంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ఆత్మకూరు : ఆత్మకూరులోని ప్రధాన కూడలిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి నాయకులు పుల్లన్న, శీన, ఆవాజ్ మండల కార్యదర్శి వలి, సిఐటియు మండల కార్యదర్శి జయమ్మ, వెంకటమ్మ, సువర్ణమ్మ, అంగన్వాడీ టీచర్స్ విజయ, సంగమ్మ, నాగరత్నమ్మ, నూర్జహాన్, కృష్ణకుమారి, లక్ష్మీ, లక్ష్మీదేవి, కార్మికులు పాల్గొన్నారు.

రాయదుర్గం : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, వ్యవసాయ వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పాత బస్టాండ్ రాణి సత్రంలో ఆయన ఈ జీపుజాతాను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున, సీనియర్ నాయకులు నాగరాజు, మధు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు శివ, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాప్తాడు : రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా రాప్తాడులో కొనసాగింది. సిఐటియు నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, మండల ప్రాంతీయ కమిటీ సభ్యులు పోతు లయ్య, సిఐటియు రాప్తాడు హమాలీ మధు, శేషు, అజయ్, భాస్కర్, ప్రజా నాట్యమండలి శ్రీనివాసులు, పుల్లన్న, పాల్గొన్నారు.

గుంతకల్లు : కలెక్టరేట్ ఎదుట రైతు, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం చేపట్టిన జీపు జాతా గుంతకల్లులో కొనసాగింది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి స్థానిక పొట్టి శ్రీరాములు కూడలిలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమం లో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, సురేంద్ర, తిమ్మప్ప, రమేష్, విరూపాక్షి పాల్గొన్నారు.

ఉరవకొండ : రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా ఉరవకొండలో కొనసాగింది. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్, నాయకులు మురళి, రవికుమార్, ఆంజనేయులు, వీరాంజనేయులు, డప్పు కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ దృష్టికి ఇళ్ల స్థలాల అక్రమాలు

ప్రజాశక్తి-రాయదుర్గం



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

వైసిపి పాలనలో పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన భూ సేకరణ కుంభకోణంపై సిఐడి విచారణ జరపాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. ఇళ్ల స్థలాల భూసేకరణలో నియోజకవర్గంలో రూ. 6 కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. గుమ్మఘట్ట వైసిపి మండల కన్వీనర్ గొల్లపల్లి కాంతారెడ్డి, నేత్రపల్లి బీమారెడ్డి 8 మంది రైతులతో రూ. 6 కోట్లు స్వాహా చేశారని తెలిపారు. పేద రైతుల నుంచి ఎకరా రూ. 6 నుంచి రూ. 8 లక్షలకు భూమిని కొనుగోలు చేసి రూ. 35 నుంచి రూ. 40 లక్షల వరకూ ప్రభుత్వానికి అమ్మారన్నారు. పేద రైతుల భూములను అడ్డుపెట్టుకొని కోట్లాది రూపాయలు స్వాహా చేసిన వైసిపి నాయకులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

అక్రమ మైనింగ్‌పై అసెంబ్లీలో ప్రస్తావించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం



చిందనూరు నాగరాజు

వైసిపి హయాంలో జగనన్న లేఅవుట్ల భూసేకరణలో జరిగిన అవకతవకలపై బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రస్తావించడం పట్ల బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. జగనన్న లేఅవుట్ భూ సేకరణ విషయమై విచారణ జరపాలని తాము కొంతకాలంగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల స్థలాలకు భూమి కేటాయించిన రైతులకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో కోరడం అభినందనీయం అన్నారు. అలాగే రాయదుర్గంలో జరుగుతున్న అక్రమ మైనింగ్, మట్టి, ఇసుక అక్రమ రవాణాపైన అసెంబ్లీలో ప్రస్తావించాలని, సిఐడి విచారణ జరిపించి సహజ వనరులను జాతీయ సంపదను కాపాడాలని కోరాలని చిందనూరు నాగరాజు కోరారు.

'ఉపాధి' జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-పామిడి

పామిడి మేజర్ గ్రామ పంచాయతీలో బుధవారం ఎంపీడీవో తేజోష్న, ఈఓఆర్డి కృష్ణమోహన్, పంచాయతీ సెక్రటరీ గోపాల్, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌కు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ జాబ్‌కార్డు లేని వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాత జాబ్ కార్డు ఉంటే దానిని యాక్టివేషన్ చేయించుకొని ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాల న్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రభాకర్‌చౌదరి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ లంగాల గౌస్, జింకల సంజీవకుమార్, కొట్టం మాలిక్, తేల్‌బాషా, కొండాపురం రఫీ, బొమ్మామోహన్, పత్రా శీన, కరూర్ శివ, అప్పన్న గారి కుమార్, తిమ్మప్ప, కుళ్లాయి, ఉపాధి హామీ, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శివప్రసాద్

స్థానిక ఎంపిడిఒ కార్యా లయంలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళా న్యా య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డిఎల్ఎస్ఎ జడ్జి, సెక్రటరీ శివప్రసాద్ యాదవ్, డిఎల్ఎస్ఎ న్యాయవా దులు పద్మజ, హరికృష్ణ హాజరై మహిళా చట్టాలు, గృహహింస నిరోధక చట్టాలు, సమన్యాయం, సమాన అవకాశాలు, సమాన వేతనం, తదితర అంశాలపై మహిళ లకు అవగా హన కల్పించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిం చారు. గ్రామాల్లో మహిళలను చైతన్యపరచడానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చిన లక్ష్మీదేవి, మేరీ, పోలేశ్వరమ్మ, అన్నపూర్ణమ్మలను ప్రత్యేకంగా అభినందించి ఛాంపియన్లుగా ప్రతిపాదించారు. సదస్సులో ఎంపిపి హేమలత, ఎంపీడీవో జీ.లక్ష్మీనరసింహ, డిటి బాలమ్మ, ఎంఈఓ రామాంజనేయులు, ఏపీఎం పద్మావతి, ఐసిడిఎస్ లావణ్య, ఏపీవో సుజాత, మండలంలోని వివిధ గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బంది లక్ష్యాలను సాధించాలి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలో పశువుల షెడ్లు, ఫారంపాండ్లు, కమ్యూనిటీ సోప్ ఫీట్స్, హార్టికల్చర్‌కు సంబంధిం చిన పనులను వేగవంతం చేసి లక్ష్యాలను చేరుకోవాలని మండల నోడల్ ఆఫీసర్ సలీం బాషా ఎన్ఆర్ ఈజిఎస్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే మండలం పశువుల షెడ్ల మంజూరులో ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఆయా పనుల ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీసి వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలన్నారు. సమావేశంలో ఎపిడి రమేష్ నాయక్, ఎంపీడీవో నందకిషోర్, ఏపీఓ వండరీష్, జేఈ జయప్రకాష్, టెక్నికల్ అసిస్టెంట్లు అవినాష్, మంజునాథ్, రవిచంద్ర, రాజు, బిఎఫ్‌టి వన్నూరుస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ సలీంబాషా

తాగునీటి వృథాను అరికట్టరా..?

ప్రజాశక్తి-నార్పల

స్థానిక వడ్డేవారి కాలనీ, చెక్ డ్యాం సమీపంలో తాగునీటి పైపులు కొద్దిరోజులుగా లీకేజీ అవుతూ నీరు వృథా కావడంతో పాటు కలుషితమవుతున్నాయి. అయినా ప్రజాప్రతినిధులు కానీ అధికారులు కానీ పట్టించుకోవడం లేదు. నీరు కలుషితం కావడంతో ప్రజలు టైఫాయిడ్, కలరా, తదితర వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సిఐ బి.వెంకటేశ్వర్లుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ జగదీష్

సిఐకి ఎస్పీ ప్రశంస

ప్రజాశక్తి-గుత్తి

విధి నిర్వహణలో గుత్తి సిఐ బి.వెంకటేశ్వర్లు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో ఆయన జిల్లా ఎస్పీ జగదీష్ నుంచి బుధవారం ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ నెలలో జరిగిన ఓ ఛీటింగ్ కేసులో సిఐ నిందితులను అరెస్టు చేశారు. అలాగే మహిళలపై నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టారు. సిఐ సేవలను గుర్తించిన జిల్లా ఎస్పీ జగదీష్ ప్రశంసించి 'గుడ్ వర్క్ డన్' సర్టిఫికెట్‌ను అందజేశారు. ఎస్పీ ప్రశంసలు అందుకున్న సిఐను పలువురు అభినందించారు.

పాలిటెక్నిక్ కళాశాలలో 'స్కిల్ హావర్'

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హావర్‌ను ప్రవేశపెట్టినట్లు ప్రిన్సిపల్ అష్రఫ్ అలీ తెలిపారు. కళాశాలలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కిల్ హావర్‌లో సాంకేతిక, విప్లవాత్మక మార్పులు, వ్యాపార లావాదేవీలు, దేశ ఆర్థిక ప్రగతి, తదితర అంశాలపై నిపుణులతో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఈ శాఖ అధిపతి సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని కోవూరు నగర్‌లోని ఎయిమ్ ఫర్ సేవ బాలుర ఛాత్రాలయానికి 17 రకాల నిత్యావసర వస్తువులు, బియ్యం ప్యాకెట్ అందజేశారు. ఆశ్రమంలోని విద్యార్థులకు ఆశ్రమం నిర్వాహకులు చక్రపాణి సమక్షంలో భోజనం ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి తెలిపారు. ట్రస్ట్ సభ్యులు, ప్రవాస భారతీయులు కల్లమడి రవీంద్రనాథ్, రమాదేవి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యాత్మానంద, సౌధామణి పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లిలో డిఎల్‌డిఒ పర్యటన

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో డిఎల్‌డిఒ నాగేశ్వరరావు పర్యటించినట్లు సర్పంచి సందీప్ కుమార్, ఎంపీడీవో నందకిషోర్ తెలిపారు. ఇటీవల కలెక్టర్ మండలంలోని వేపులపర్తి గ్రామానికి వచ్చినప్పుడు సర్పంచి గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను తెలిపారు. దీంతో డిఎల్‌డిఒ నాగేశ్వరరావు మంగళ, బుధవారాల్లో గ్రామంలో పర్యటించి సమగ్ర విచారణ చేసి నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపారు. ఆయన వెంట ఎంపీడీవో నందకిషోర్, పంచాయతీ కార్యదర్శులు అనిల్, మంజుల ఫీల్డ్ అసిస్టెంట్ ఎర్రిస్వామి, నాయకులు మేకప్పగారి రాము, ఎస్ఎంసి ఛైర్మన్ మల్లికార్జున, వైస్ సర్పంచి గోపాల్ ఉన్నారు.

నర్సరీలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

డివిజన్ పరిధిలోని నర్సరీల నిర్వాహకులు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, పాతవారు రెన్యూవల్ చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారిణి మౌనిక సూచించారు. ఆమె బుధవారం షెడ్ నెట్ నర్సరీలను పరిశీలించారు. నర్సరీ యజమానులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. నారు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. నాసిరకం నారు విక్రయించినా, అధిక ధరకు విక్రయించినా చర్యలు తప్పవ న్నారు. ఆమె వెంట ఆర్ఎస్‌కె సిబ్బంది ఉన్నారు.



నర్సరీలను తనిఖీ చేస్తున్న అధికారిణి మౌనిక

కలెక్టర్, జెసిలను కలిసిన అహుడా ఛైర్మన్

ప్రజాశక్తి-అనంతపురం




కలెక్టర్‌కు పూలబొకే ఇస్తున్న టిసి.వరుణ్

అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా నియమితులైన జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ బుధవారం జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మలను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేలు, శాలువాలతో సన్మానిం చారు. జిల్లా కలెక్టర్, అహుడా ఛైర్మన్ అహుడా అభివృద్ధిపై చర్చించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే అహుడా సంస్థకు ఛైర్మన్‌గా నియమితులు కావడం పట్ల టిసి వరుణ్‌కు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ అంకె ఈశ్వరయ్య, జనసేన జిల్లా కార్యదర్శి ఇండ్ల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాయదుర్గం ఆర్టీసీ డిఎంగా శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం



పాత, కొత్త డిఎంలను సత్కరిస్తున్న కార్మికులు, ఉద్యోగులు, సంఘాల నాయకులు

రాయదుర్గం ఆర్టీసీ డిపో నూతన మేనేజర్‌గా బుధ వారం శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. బద్వేలు డిఎంగా పని చేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు, సంఘాల నాయకులు డిపో అభివృద్ధికి సహకరించాలని కోరారు. అలాగే బదిలీపై గవర్నర్‌పేట డిపోకు వెళ్తున్న డిఎం సురేష్‌ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సురేష్ సంస్థకు చేసిన సేవలు మరువరానివని ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంఎఫ్ శిరీష, ట్రాఫిక్ ఇన్‌ఛార్జి ఉమాపతి, అసిస్టెంట్ మేనేజర్ ఫైనాన్స్ బాబు, ఆఫీస్ సూపరింటెండెంట్ బాలసుబ్రమణ్యం, ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి రామలింగ, ఎన్ఎంయు కార్యదర్శి తిప్పేస్వామి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వీరేష్, డిపో, గ్యారేజ్ కార్మికులు, ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

'అనంతలక్ష్మి'లో ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

నగర శివారులోని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ సేవా పథం ఆధ్వ ర్యంలో ప్రిన్సిపల్ డా. ఎన్.రామ్మూర్తి అధ్యక్షతన విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహశీల్దార్ కె.మోహన్‌కుమార్, ఆర్ఐ సందీప్ హాజరయ్యారు. వారు ఓటు ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఎన్నికల్లో ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలి పారు. అలాగే ఓటరు ఎన్‌రోల్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథం అధికారి ఖలీల్‌బాషా, నవీన్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-గుమ్మగట్ట

మండలంలోని 75-వీరాపురంలో బుధవారం ప్రహ్లాద(38) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. మృతుని తమ్ముడు సంతోష్ తెలిపిన వివరా లు.. మండలంలోని గోనబావికి చెందిన ప్రహ్లాదకు, 75-వీరాపురం గ్రామంలోని బసప్ప కుమార్తె తిప్పమ్మతో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి సంధ్య, అభిరామ్ సంతానం ఉన్నారు. అనారోగ్యంతో తిప్పమ్మ మృతి చెందగా ఇదే గ్రామంలో పాలయ్య కూతురు పద్మక్కను రెండో వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి వారు వీరాపురంలోనే ఉంటున్నారు. ఈమెకు పిల్లలు లేరు. ఉపాధి కోసం ప్రహ్లాద బెంగళూరుకు వలస వెళ్లి అక్కడే నివాసం ఉండేవాడు. మూడు రోజుల క్రితం వీరాపురం వచ్చి తనతో పాటు బెంగళూరుకు రావాలని భార్యను కోరగా ఆమె నిరాకరించింది. ఈ విషయంలో గొడవ చోటుచేసుకోవడంతో పద్మక్క బంధువులు తీవ్రంగా కొట్టడంతోనే ప్రహ్లాద చనిపోగా వారు ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు అతడి లుంగీతోనే ఉరి వేశారని ఆరోపించాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ ఈశ్వరయ్య సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలులో నుంచి జారిపడి యువకుడు మృతి

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి ఆర్ఎస్‌లోని సెయింట్ మేరీస్ పాఠశాల సమీపంలో రైల్వే వంతెన వద్ద బుధవారం రైలులో నుంచి జారి పడి ఓ యువకుడు మృతి చెందాడు. జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు తెలిపిన వివరాలు.. రైలు పట్టాల వద్ద గుర్తుతెలియని మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ, కానిస్టేబుల్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ జారి కిందపడి మృతి చెంది ఉంటాడని, దాదాపు 30 ఏళ్లు ఉంటాయని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని వారు సూచించారు.

అక్రమంగా ఇసుక తవ్వుతున్న వాహనం సీజ్

రాయదుర్గం రూరల్ : మండలంలోని వేపరాల సమీపంలో వేదవతి హగరి నదిలో అనుమతి లేకుండా హిటాచీతో ఇసుకను తోడుతుండగా మైన్స్ ఏడి ఆదినారాయణ, తహశీల్దార్ నాగరాజు సీజ్ చేశారు. డిఎంసి గుత్తేదారు ఎటువంటి అనుమతులు లేకుండానే హిటాచీతో ఇసుక తవ్వి టిప్పర్లకు లోడ్ చేసి తరలిస్తున్నట్లు గుర్తించారు. హిటాచీని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి-రాయదుర్గం



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ. 21 వేలు ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని కోరుతూ సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కార్మికులు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు తిప్పేరుద్ర, మైలారస్వామి, శ్రీనివాసులు, రాము, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : జీవో-36 ప్రకారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ. 21 వేలు ఇవ్వాలని సిఐటియు అనుబంధ సంస్థ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం యూనియన్ అధ్యక్షుడు ఎస్.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎస్ఎ.మురళి, కార్యదర్శి కె.రవిశంకర్ కోరారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ బి.జబ్బార్ మియాకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ సహాయ కార్యదర్శులు నరసింహులు, ఆది, కోశాధికారి శేఖర్, నాయకులు బాబా, సాధిక్, మధు, రమేష్, ముత్యాలు, ఓబులేసు, దాదు, పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-కుందుర్పి



అధికారులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఈబి.దేవి

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఈబి.దేవి తెలిపారు. ఆమె బుధవారం పలు పిహెచ్‌సిలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. పిహెచ్‌సి ముందు అపరిశుభ్రం, మొక్కలు ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ క్యాన్సర్ స్క్రీనింగ్ ద్వారా మూడు రకాల వైద్య సేవలు అందిస్తూ మెరుగైన వైద్య సేవల కోసం విశాఖపట్నం, విజయవాడ నగరాలకు పంపిస్తామని తెలిపారు. ఎనుములదొడ్డి గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచి పలు సమస్యలను తెలుపగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అప్పిలేపల్లిలో టీకాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె వెంట ఎన్‌సిడి సెల్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, వైద్యాధికారులు అనూషదేవి, చాంద్ బేగం, నారాయణ స్వామి, సోమేశ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ మెంబర్‌కు సన్మానం

ప్రజాశక్తి-పామిడి



రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ మెంబర్ రమేష్‌నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

మండలంలోని పాల్యంతండాకు చెందిన ఆర్.రమేష్‌నాయక్ రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ మెంబర్‌గా ఎంపికైన సందర్భంగా బుధవారం మండలంలోని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి అనంతపురం పార్లమెంట్ కార్యదర్శి రాజేష్ నాయక్, బిజెపి జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులు రంజిత్ నాయక్, టిడిపి రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఎస్టీ కార్యనిర్వాహక కార్యదర్శి రామాంజనేయులు, మండల కన్వీనర్ ముసలిరెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు అంజినాయక్, నాయకులు సంజీవ, మల్లికార్జున, లాయర్ సురేష్‌నాయక్, ఓబులాపురం ఓబులేష్, మల్లేష్‌రెడ్డి, హరి, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, మోహన్, గోపాల్, బిల్లా, భాస్కర్, అశోక్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

జెసి నమ్మకాన్ని వమ్ము చేయను : మాల కార్పొరేషన్ డైరెక్టర్

ప్రజాశక్తి-తాడిపత్రి



విలేకరులతో మాట్లాడుతున్న కమలమ్మ

మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము కానివ్వనని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొంకరి కమలమ్మ తెలిపారు. ఆమె బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ జెసిపిఆర్ తనపై నమ్మకం ఉంచి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా, ఇప్పుడు మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశం కల్పించి సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డికి రుణపడి ఉంటానని తెలిపారు. తాడిపత్రి పేరును రాష్ట్రంలో నిలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ డిష్ సోము ఇంటి నుంచి ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం వరకూ రూ. 3.6 లక్షల వ్యయంతో పనులు చేపట్టారన్నా రు. కార్యక్రమంలో నాయకులు మాదినేని రామాంజనేయులు, రాజేష్, కేశవానంద, వార్డు సభ్యులు రామాంజనేయులు, గోవిందు, గోపాల్, వరప్రసాద్, జగన్నాథ్, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

అధునాతన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

'ఫార్చ్యూన్ కనెక్ట్' మేనేజింగ్ డైరెక్టర్ షరీఫ్

ప్రజాశక్తి-అనంతపురం

పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు అధునాతన నైపుణ్యాలను పెంపొందించుకుంటూ అభివృద్ధి వైపు దూసుకుపోవాలని 'ఫార్చ్యూన్ కనెక్ట్' మేనేజింగ్ డైరెక్టర్ షరీఫ్ సూచించారు. నగరంలోని ప్రభుత్వ ఐటిఐలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన విదార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కేవలం సర్టిఫికెట్ ఉంటే సరిపోదని, పని చేస్తున్న రంగంలో నైపుణ్యం ఉండాలన్నారు. ఐటిఐ పిన్సిపల్ రామ్మూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందిస్తామన్నారు. జాబ్‌మేళాలో 80 మంది పాల్గొనగా 28 మంది ఎంపికయ్యారని, వారికి రూ. 12 వేలు వేతనం ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అండర్ పాస్ బ్రిడ్జి విస్తీర్ణం పెంచాలి

ప్రజాశక్తి-డి.హీరేహాల్

అంతర్రాష్ట్ర రహదారి విస్తరణలో భాగంగా డి.హీరేహాల్ మధ్యలో ఏర్పాటు చేస్తున్న అండర్ పాస్ బ్రిడ్జి విస్తీర్ణం పెంచాలని రెండు రోజులుగా ప్రజలు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా బుధవారం మండల నాయకులు, ప్రజలు బళ్లారి ఎంపీ తుకారామ్‌ను కలిసి బ్రిడ్జి విస్తీర్ణం పెంచాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. భవిష్యత్తులో హీరేహాల్ మీదుగా జిందాల్‌కు రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉందని, కావున బ్రిడ్జి విస్తీర్ణం పెంచి నిర్మించాలని విన్నవించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ నాగలి రాజు, టిడిపి నాయకులు శివ, మహాబలేశ్వర, తిప్పేస్వామి, శ్రీనివాసులు, వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.



బళ్లారి ఎంపి తుకారామ్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి హెచ్.శ్రీనివాసులు ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సరస్వతీ విద్యామందిరం పాఠశాల హెచ్ఎం తిరుమల్ రావు, చల్లా కిషోర్, ఎల్ఎం మూర్తి హాజరై గ్రంథాలయాల ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే గ్రంథాలయాలకు వెళ్లడం, పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్, ఇతర క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది కె.ఉమామహేశ్వరి, బిడిసి నిర్వాహకులు శ్యామల, యమున, సౌందర్య, వసంతకుమార్, రేష్మ, రఘు, బాలచంద, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్లూరు : స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, పరుగు పందెం నిర్వహించి విజేతలకు గ్రంథాలయ అధికారి జయరాం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మురళి, పవన్, వినీత్, సౌభాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

నార్పల : గ్రంథాలయ అధికారిణి జీవన ఆధ్వర్యంలో శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పరుగు పందెం పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాషా, శ్రీవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా శాఖా గ్రంథాలయంలో స్థానిక కెజిబివి విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రంథాలయ అధికారిణి నల్లమ్మ, కెజిబివి ఎస్ఒ నీమారోజ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : స్థానిక గ్రంథాలయంలో అధికారి పి.కమ్మన్న అధ్యక్షతన ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎస్కేపి డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గోపీనాయక్‌చౌహాన్, లెక్చరర్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం జ్యోతి హాజరై గ్రంథాల యాల ప్రాధాన్యతను వివరించారు. పాల్గొన్నారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సహ గ్రంథాలయ అధికారిణి ఎం.హేమలత, రికార్డు అసిస్టెంట్ సి.రాము, ఉపాధ్యాయులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామిడి : శాఖా గ్రంథాలయంలో అధికారిణి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఎంఇఒ-2 సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు సభ్యత్వం తీసుకొని పుస్తకాలు చదివి విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టిసి ఉన్నత పాఠశాల హెచ్ఎం రామ్‌కుమార్, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసనాయుడు, రాజేష్, జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు అనురాధ, తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారి



రాప్తాడులో విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న అధికారి

బొమ్మనహాల్ : గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఎంపీపీ పాఠశాలలో ఎంఇఒ మల్లికార్జున విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయదుర్గం : గుమ్మగట్టలోని శాఖా గ్రంథాలయంలో అధికారి నాగరాజు ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు రమ్య, అతిథులు సదాశివ, శివలింగప్ప, అనంతరెడ్డి హాజరై పోటీల విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రాప్తాడు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల విజేతలకు ముఖ్యఅతిథులు బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయ అధికారులు, ఉపాధ్యాయులు, పెద్దలు, పిల్లలకు గ్రంథాలయాల ప్రాధాన్యతను తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.వీరనారాయణరెడ్డి, ఆనంద్‌ప్రసాద్, పి.శ్రీహరి, ఉపాధ్యాయులు పి.లక్ష్మయ్య, రామాంజనేయులు, నాగభూషణం, నాగన్న, పాఠకులు పాల్గొన్నారు.

ఉరవకొండ : గ్రంథాలయ అధికారి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఎంఇఒ ఈశ్వరప్ప ముఖ్యఅతిథిగా హాజరై విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ హెచ్ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు, పిఇటి కిరణ్, పాఠకులు పాల్గొన్నారు.

గుత్తి : శాఖా గ్రంథాలయ అధికారి హెచ్.రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన గ్రంథాలయ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత గ్రంథాలయ అధికారి ఎసి.సుబ్బన్న, సామాజిక కార్యకర్త సలీం హాజరయ్యారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులను శాలువా, పూలమాలలతో సత్కరించారు.

బెళుగుప్ప : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని విద్యార్థులు, నిరుద్యోగులు, యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయులు నాగరాజు, శాఖా గ్రంథాలయ అధికారి ప్రతాపరెడ్డి తెలిపారు. సన్‌రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎర్రిస్వామి, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్

జాగ్రత్తలతో డెంగీ నుంచి రక్షణ

ప్రజాశక్తి-రాయదుర్గం

డెంగీ వ్యాధి అంటే భయపడాల్సిన అవసర లేదని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల డెంగీ నుంచి రక్షణ పొందవచ్చునని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని 11వ వార్డు పరిధిలో బుధవారం డెంగీ, టైఫాయిడ్, మలేరియా, తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు, మందులు, దోమల నివారణపై వివరించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ ప్రమీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో ఇంటి పన్ను చెల్లించాలి : కమిషనర్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ప్రజలు సకాలంలో ఇంటి పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడాలని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31వ తేదీలోపు చెల్లిస్తే అపరాధ రుసుము ఉండదన్నారు. ఖాళీ స్థలాలు, నీటి కుళాయిలు సంబంధిత బిల్లులు చెల్లించాల న్నారు. నిర్లక్ష్యం చేస్తే ఆ సేవలను తొలగిస్తామని హెచ్చరించారు.

పంటల బీమాకు 15 వరకు గడువు

ప్రజాశక్తి-బెళుగుప్ప

రబీ సీజన్‌లో పప్పుశెనగ, వరి, జొన్న, మొక్కజొన్న, వేరుశెనగ పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా బీమా పొందడానికి అవకాశం ఉందని ఏవో పృథ్వీసాగర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆయా పంటలకు డిసెంబర్ 15 లోపు, వరి పంటకు డిసెంబర్ 31 లోపు పంట బీమా చెల్లించాలన్నారు.



ఏవో పృథ్వీసాగర్

పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని శనగలగూడూరు గ్రామంలో బుధవారం ఏవో కాత్యాయిని ఆధ్వర్యంలో సోయా చిక్కుడు పంటలో పంటకోత ప్రయోగం చేపట్టారు. ఆమె వెంట ఎఇఒ హరి, విఎఎ భార్గవి, విఆర్ఎ రవి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



పంట కోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

జాగ్రత్తలతో వ్యాధుల నుంచి రక్షణ

ప్రజాశక్తి-ఉరవకొండ

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వజ్రకరూరు తహశీల్దార్ నయాజ్ అహ్మద్, వైద్యాధికారి తేజేశ్వరి సూచించారు. వజ్రకరూరు పిహెచ్‌సిలో బుధవారం వైద్యాధికా రిణి వి.తేజేశ్వరి అధ్యక్షతన సీజనల్ వ్యాధులపై మండల స్థాయి అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్, వైద్యాధికారి మాట్లాడుతూ పరిశుభ్రత, దోమల నివారణ, వ్యాధుల లక్షణాలు, జాగ్రత్తలు, నివారణ మందుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచి మోనాలిసా, వైద్యాధికారి సర్దార్‌వలి, పంచాయతీ కార్యదర్శి మల్లయ్య, విఆర్ఒ జి.భరత్‌కుమార్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి బి.గురు ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ జె.సత్యనారాయణ, హెల్త్ సూపర్వైజర్ బి.నాగశంకర్, ల్యాబ్ టెక్నీషియన్ వై.లలిత, స్టాఫ్ నర్స్ సుజాత, ఎఎన్ఎం సుకన్య, భారతి, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయాలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై ర్యాలీ చేపట్టిన వైద్య సిబ్బంది



గుమ్మేపల్లిలో సభ్యత్వ నమోదు చేపట్టిన టిడిపి నాయకులు

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని గుమ్మేపల్లి గ్రామంలో బుధవారం టిడిపి నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. టిడిపి అధికార ప్రతినిధి, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వహణ కార్యదర్శి దేగల కష్ణమూర్తి సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచి దేగల లలితమ్మ, నాయకులు దేగల శ్రీనివాసులు, దేగల శివయ్య, మల్లికార్జున, ఓబయ్య, వడ్డే రామాంజనేయులు, కురుబ ఓబుళపతి, కురుబ ఓబులేసు, గంగాధర్, బండి ఎర్రిస్వామి, దండు ఈశ్వర య్య, కమ్మర నారాయణస్వామి, బ్రహ్మయ్య, నాగభూషణాచారి, బాలబ్రహ్మం, శ్రీనివాసాచారి, బెస్త సూర్యనారాయణ, హేమంత్, శ్రీరాములు, రామ్మూర్తి, కురుబ నారాయణస్వామి, కురుబ ఆంజనే యులు, కురుబ శేఖర్, తోట ఓబుళపతి, రమేష్, వడ్డే బాలరాజు, పూలకుంట ఆదినారాయణ, గండే మల్లికార్జున, దండు సూర్యనారాయణ, దేగల కిరణ్, కోయగూర పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

కత్రిమలలో ..

పామిడి : మండలంలోని కత్రిమల గ్రామంలో బుధవారం టిడిపి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్ర మం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఓబులేసు, సురేంద్ర, మేఘన, మహేష్ చౌదరి, శ్రీనివాసులు, రాము, గోపాల్, రాంబాబు, గంగాధర్, నాగేంద్ర, జానకిరాముడు, ఆవుల శ్రీనివాసులు, వెంకటరాముడు, ఐటిడిపి అధ్యక్షుడు ఆవుల శివ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్లు మండలంలోని కొట్టాలపల్లి, ఉరవకొండ మండలంలోని బూదగవి గ్రామాల్లో బుధవారం ఏవోలు పెన్నయ్య, శుభకర్ పర్యవేక్షణలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది, పప్పుశెనగ పొలాల్లో పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలు, దిగుబడి, తెగుళ్లు, నివారణ మందుల గురించి రైతులకు వివరించారు. వారి వెంట ఎఇఒ రాఘవేంద్ర, రైతు సేవా కేంద్రం సిబ్బంది షఫీ, గోపాల్‌నాయక్, యోగానంద, టిడిపి నాయకులు రామస్వామి, రైతులు, సుంకన్న, ధనుంజయ, గోవిందు, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని కుమ్మనమల గ్రామంలో బుధవారం ఏవో కాత్యాయిని ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. అధికారులు కంది పంటను పరిశీలించి అందులో చీడ పీడలు, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎఇఒ హరి, విహెచ్ఎ అజయ్, రైతులు పాల్గొన్నారు.



విడపనకల్లు మండలంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

విధులు బహిష్కరణ.. నిరసన బాట..!



నిరసన తెలుపుతున్న సిఐటియు, మున్సిపల్ యూనియన్ నాయకులు

మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

కార్మికులు పనిచేయడానికి అవసరమయ్యే పనిముట్లు, రక్షణ పరికరాలు, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికులు నిరసన బాట పట్టారు. గురువారం నుంచి విధులను బహిష్కరించి నిరసనలు కొనసాగిస్తామని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు నేతలు తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శులు వెంకటనారాయణ, ముర్తుజ, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎటిఎం.నాగరాజు, కె.నాగభూషణ, నగర ప్రధాన కార్యదర్శి సాకే.తిరుమలేశు, ఇంజినీరింగ్ సెక్షన్ నగర అధ్యక్షులు ఓబుళపతి పాల్గొన్నారు. అనంతపురం నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బకాయి వేతనాలు, పనిముట్లు, రక్షణ పరికరాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు, చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఉపాధి, ఎక్స్‌గ్రేషియా, డెత్ బెనిఫిట్స్ తదితర సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. పెరిగిన నగర విస్తీర్ణం, జనాభాకి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచలేదన్నారు. కార్మికులపై పనిభారం పెరిగి అనారోగ్య సమస్యలు ఉత్పన్నమై ప్రాణాంతక వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. ఈ అంశంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పరిష్కార దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. కార్మికులపై పడుతున్న అదనపు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు ఈ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు అధికారులను కోరినా స్పందన లేకపోవడంతో నేటి నుంచి విధులను బహిష్కరించి ఆందోళనకు సిద్ధం అవుతున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఒకటవ నగర అధ్యక్షులు ఎన్టీఆర్ శీన, ఆటో యూనియన్ నాయకులు ఆజామ్, మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి బత్తల ఆదినారాయణ, నగర అధ్యక్షులు బండారు ఎర్రిస్వామి, లక్ష్మీనరసమ్మ, ఇంజనీరింగ్ సెక్షన్ నగర ప్రధాన కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.



భూసార పరీక్ష పత్రాలు చూపుతున్న రైతులు

భూసార పరీక్ష ఫలితాలపై శిక్షణ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని సంతేకొండాపురం గ్రామంలో బుధవారం సర్పంచి వనితామల్లికార్జున ఆధ్వర్యం లో రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు శిక్షణ, అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి, ఏవో సరిత భూసార పరీక్ష ప్రాము ఖ్యత, విత్తనశుద్ధి, ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి అనిత, అగ్రికల్చర్ అసిస్టెంట్ ముజాహిద్, నాయకులు కారేగౌడ, నల్లమల్ల, చెన్నమల్ల, ఓబులేష్, మల్లికార్జున, నరసింహులు, దండు తిప్పేస్వామి, జెసిబి ఎర్రిస్వామి, వార్డ్ మెంబర్ లక్ష్మన్న, రైతులు పాల్గొన్నారు.

సిపిఎం నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్

ప్రజా కార్మిక పోరాటాల్లో భాగంగా 2017లో అనంతపురం సర్వజన ఆసుపత్రి ఎదుట మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ప్రభుత్వ ఆసుపత్రిని 500 పడకలుగా మార్చాలని నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సమయంలో అప్పటి మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి మార్గంలో వెళ్తుండగా సిపిఎం నాయకులు ఆయన్ను ఆపి ఆసుపత్రి సమస్యలను విన్నవించే ప్రయత్నం చేవారు. మంత్రిని అడ్డుకున్నారన్న నెపంతో పోలీసులు సిపిఎం నాయకులపై కేసును బనాయించారు. ఈ కేసుకు సంబంధించి ఏడు సంవత్సరాల విచారణ అనంతరం బుధవారం నాడు కేసును జిల్లా న్యాయస్థానం కొట్టి వేసింది. ఈ కేసులో ఉన్న సిపిఎం సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలీ, సిపిఎం నగర నాయకులు ప్రకాష్, చంద్రాయుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రామాంజి నేయులుపై కేసు కొట్టి వేస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసును న్యాయవాది జూటూరు సుధాకర్ రెడ్డి ఉచితంగా వాదించి సిపిఎం నాయకులకు అండగా నిలిచారు. ఈయనకు సిపిఎం నాయకులు ధన్యవాదాలు తెలిపారు.



కేసు కొట్టివేత అనంతరం కోర్టు బయట విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

సిబ్బంది రాక.. సచివాలయం తెరవక..!



తాళం వేసిని బొప్పేపల్లి సచివాలయం

తెరుచుకోని బొప్పేపల్లి గ్రామసచివాలయం

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలోని బొప్పేపల్లి గ్రామ సచివాలయం బుధవారం నాడు తెరుచుకోలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయానికి వేసిన తాళం వేసినట్లే ఉంది. సిబ్బంది ఎవరూ కార్యాలయం గంట సేపు కూడా కన్పించలేదు. త్వరలో జరగనున్న సాగు నీటి ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ అధికారులకు మాత్రమే జిల్లా కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ తరగతుల సాకుతో బొప్పేపల్లి సచివాలయానికి సిబ్బంది ఎవరూ రాకుండా డుమ్మా కొట్టేశారు. ఈ సచివాలయ పరిధిలో ఉన్న మూడు గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు అక్కడే కూర్చొనే ఎవరూ రాకపోవడంతో వెనుదిరిగారు. ప్రస్తుతం జనన ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సచివాలయ సిబ్బంది కార్యాలయానికి రాకపోవడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎంపిడిఒ వాసుదేవరరెడ్డిని వివరణ కోరగా ప్రస్తుతం సాగు నీటి ఎన్నికల నేపథ్యంలో సచివాలయ సిబ్బంది జిల్లా కేంద్రంలో శిక్షణ తరగతులకు వెళ్లారన్నారు. బొప్పేపల్లి సచివాలయంలో నలుగురు మాత్రమే సిబ్బంది ఉన్నారని ఈ నేపథ్యంలో తాళం వేసి ఉంటారని చెప్పారు.

చెడు వ్యసనాల జోలికెళ్లొద్దు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

విద్యార్థి దశలో చెడు వ్యసనాల జోలికి వెళ్లవద్దని ఎక్సైజ్ సిఐ పవన్‌కుమార్ సూచించారు. స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం డ్రగ్ రహిత ఎపి కార్యక్రమం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందన్నారు. 15-25 ఏళ్ల వయసు చాలా కీలకమైందని, ఈ దశలో చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా మంచి లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మీనారాయణ, మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు నారాయణ, కోదండరాములు, నాగప్ప పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు మినహాయింపుకై విజ్ఞప్తి

రాయదుర్గం : పట్టణంలోని రాయదుర్గం-బళ్లారి రోడ్డు 120 అడుగుల వెడల్పు ఉన్నందున దాని పక్కన ఉన్న ప్లాట్లకు అదనంగా 40 అడుగుల సర్వీస్ రోడ్డు ఉండాలనే నిబంధనను మినహాయించాలని కోరుతూ బుధవారం పట్టణ వాసులు అమరావతిలో రాష్ట్ర టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యాజ్యోతి వినతిపత్రం ఇచ్చారు. వినతిని పరిశీలించి పరిష్కరిస్తామని డైరెక్టర్ తెలిపారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పొరాలు పురుషోత్తం, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గాజుల వెంకటేశులు, పాండురంగస్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు కెబి.మురళి, తదితరులు ఉన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

రైతుకు రక్షణ కవచం పంటల బీమా

నమోదుకు డిసెంబర్ 15 ఆఖరు : కలెక్టర్

ప్రజాశక్తి -అనంతపురం

పంటల బీమా రైతులకు రక్షణ కవచంలా ఉంటుందని, దీనిపై రైతులకు విస్తతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం నగరంలోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో క్రాప్ ఇన్సూరెన్స్‌పై జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ (డిఎల్ఎంసి) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంటల బీమా పథకం, రబీ 2024- 25, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పునర్ వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలపై రైతులకు క్షేత్రస్థాయిలో విస్తతంగా అవగాహన కల్పించాలన్నారు. రైతులందరూ బీమా చేయించుకునేలా చూడాలన్నారు. పంటల బీమా నమోదుకు ఆఖరు తేదీ డిసెంబర్ 15 అని, అప్పటిలోగా పంటల బీమా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం పంటల బీమా చేయండి.. రక్షణ కవచం పొందండి, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఎ.మాలోల, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ, సిపిఒ అశోక్ కుమార్, ఉద్యాన శాఖ డిడి నరసింహారావు, డిపిఒ నాగరాజు నాయుడు, ఎల్‌డిఎం నర్సింగరావు, ఎన్ఐసి డిఐఒ రవిశంకర్, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ దాసు, ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ స్టేట్ ప్రెసిడెంట్ ప్రశాంత్, జిల్లా మేనేజర్ నరసింహమూర్తి, డివిజనల్ కోఆర్డినేటర్ షఫీ, ఏవో శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రైతు, కార్మిక సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 26వ తేదీన కలెక్టరేట్ వద్ద చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శివారెడ్డి, శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను బుధవారం మండల కేంద్రంలో విడుదల చేశారు. రైతు, కార్మిక నల్ల చట్టాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న మహాధర్నాతో పాటు, గురువారం నాడు మండల కేంద్రంలో జరుగుతున్న జాపుజాతాలో రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నారాయణస్వామి, హనుమంతు రెడ్డి, నాగేంద్ర, ఆదినారాయణ, శ్రీరాములు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ ఉత్సవాలు

బుక్కరాయసముద్రం : గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పున్నం విజయభాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రిన్సిపాల్ అర్జున్ నాయక్, రిటైర్డ్ టీచర్ శ్రీరామరత్నం, రిటైర్డ్ గ్రంథాలయ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గ్రంథాలయాలు, పుస్తకాల గొప్పతనాన్ని తెలియజేశారు. అనంతరం వ్యాసరచన, వకృత్వం, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు.

పాత్రికేయులకు లయన్స్ క్లబ్ సత్కారం

రాయదుర్గం : పట్టణంలోని ఎన్జీవో భవన్‌లో లయన్స్ క్లబ్ అధ్యక్షులు అంబాజీరావు అధ్యక్షతన బుధవారం ప్రపంచ పత్రికా దినోత్సవం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా వ్యవస్థ అత్యంత కీలకమైందని, పాత్రికేయులు చేస్తున్న సేవలు మరవరానివన్నారు. పలువురు సీనియర్ పాత్రికేయులను క్లబ్ నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అశోక్‌కుమార్, కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు శంకర్ బాబు, ధనార్జన, శ్రీనివాసులు, వెంకట రమేష్, నాగరాజు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.